ఆటో డ్రైవర్లంటే అలుసా..!

- గత ఎన్నికల సమయంలో ఆటోవాలాలకు చంద్రబాబు మోసపూరిత హామీలు
- అధికారం చేపట్టి 9 నెలలు గడిచినా ఒక్కటీ అమలు చేయని వైనం
- వాహనమిత్ర అమలు, జీవో 21, 31 రద్దుకు డిమాండ్
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా మార్చి 4న రాష్ట్ర వ్యాప్త ధర్నాకు సిద్ధం


బేరాలు లేక ఆటోలో నిద్రిస్తున్న డ్రైవర్

సీతంపేట : అన్ని వర్గాలనూ మాయ చేసినట్లే ఆటో డ్రైవర్లనూ చంద్రబాబు మోసం చేశారు. గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆటోడ్రైవర్ల సంక్షేమానికి పెద్ద పీట వేసింది. ఏటా వాహనమిత్ర కింద రూ.10 వేలు ఆర్థిక సాయం, నవరత్నాల పథకాలలో భాగంగా అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పలు సంక్షేమ పథకాలతో డ్రైవర్ల కుటుంబాలకు లబ్ధి చేకూర్చింది. గత ఎన్నికల ప్రచారంలో ఆటో డ్రైవర్లకు ఎన్నో హామీలు ప్రకటించిన చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టి తొమ్మిది నెలలు గడిచినా హామీలపై ఒక్కమాట కూడా మాట్లాడకుండా మోసం చేశారని ఆటో డ్రైవర్లు మండిపడుతున్నారు. ఉద్యోగాలు లేక స్వయం ఉపాధి కింద ఆటోలు, వ్యాన్‌లు, కార్లు, జీపులు ప్రైవేట్ ఫైనాన్సర్ల నుంచి అప్పులు తీసుకుని ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తూ ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు పన్నులు చెల్లిస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్న డ్రైవర్ల సంక్షేమాన్ని విస్మరించిన చంద్రబాబు ప్రభుత్వంపై రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఒకవైపు భారీగా పెరిగిన నిత్యావసర సరకుల ధరలు, మరోవైపు పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు, వీటికి తోడు ప్రభుత్వం అమలు చేస్తున్న 21, 31 నంబరు జీవోలతో భారీ జరిమానాలతో తమకు వస్తున్న అంతంత మాత్రం ఆదాయంలో చాలా వరకు నష్టపోతున్నామని ఆటో డ్రైవర్లు, మోటారు వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల హామీలు, తమ డిమాండ్ల సాధనకు మార్చి 4న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు చేపట్టి ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలని డ్రైవర్లు, మోటారు వర్కర్స్ పెడరేషన్ (ఏఐటీయూసీ) పిలుపునిచ్చింది. అలాగే మార్చి 30న విజయవాడలో జరగనున్న ఆటో డ్రైవర్ల రాష్ట్ర మహాసభల్లో ప్రభుత్వ తీరును ఎండగట్టాలని నిర్ణయించారు.

భారీగా జరిమానాల పెంపు

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్రంలో అమలు చేస్తున్న జీవో నంబరు 21తో ఆటో డ్రైవర్లపై భారీ జరిమానాలు విధిస్తూ ఆర్థికంగా నడ్డి విరుస్తున్నారు. గతంలో డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ లేకపోతే రూ.500 నుంచి రూ.750 వరకు జరిమానాలు విధించేవారు. ప్రస్తుతం జీవో నంబరు 21 వచ్చాక డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే రూ.5 వేలు, పర్మిట్ లేకపోతే రూ.10 వేలు, ఇన్సూరెన్స్ లేకుంటే రూ.3 వేల నుంచి రూ.5 వేలు, పొల్యూషన్ సర్టిఫికెట్ లేకపోతే రూ.3 వేల నుంచి రూ.5 వేలు, ఫిట్‌నెస్ లేకపోతే రూ.5 వేలు జరిమానా విధిస్తున్నారు.

ప్రైవేటు చేతికి ఫిట్‌నెస్ పరీక్షలు

రవాణా రంగంలో ఉన్న ఆటో, వ్యాన్లు, కార్లు వంటి వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేసే విధానాన్ని ఫిబ్రవరి 17 నుంచి ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. అలాగే ప్రతి సంవత్సరం అవసరాన్ని బట్టి ఫీజు పెంచుకునే వెసులుబాటు కల్పించారు. గతంలో ఫిట్‌నెస్ ఫీజు రూ.700లు ఉండగా దానిని రూ.800కు పెంచారు. ఏటా ఫీజు పెంచుకునే వెసులుబాటుతో ఎంత మొత్తంలో పెంచుతారోనని ఆటో డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


నరసింహనగర్ స్టాండ్‌లో ఆటోలు నిలిపిన డ్రైవర్లు


ఆటోకి విధించిన జరిమానా రసీదు

ర్యాపిడోతో మరింత నష్టం



ర్యాపిడో బైక్స్ వచ్చాక ఆటో డ్రైవర్ల ఉపాధికి, ఆదాయానికి మరింత గండి పడింది. నగరంలో 6 వేల వరకు ర్యాపిడో బైక్స్ తిరుగుతున్నాయి. ఇవన్నీ ఎల్లో బోర్డు కాకుండా వైట్ బోర్డుతో తిరుగుతున్నాయి. ఎల్లో బోర్డు ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుంది. స్వయం ఉపాధితో బతుకుతున్న తమను ర్యాపిడో బైక్స్, కొత్త చట్టాలు, భారీగా పెరిగిన జరిమానాలు, ఇంధన ధరలు రోడ్డున పడేస్తున్నాయి. ప్రభుత్వం తమ సంక్షేమంపై దృష్టి సారించి ఎన్నికల హామీలు నెరవేర్చాలి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాదిరిగా వాహనమిత్ర అమలు చేస్తే కొంత ఆర్థిక భరోసా లభిస్తుంది.

– ఎం.అప్పారావు, ఆటో డ్రైవర్, నరసింహనగర్ స్టాండ్

ఆటో డ్రైవర్లంటే చంద్రబాబుకు చిన్నచూపు



చంద్రబాబు నాయుడికి ఎప్పుడూ ఆటో డ్రైవర్లంటే చిన్నచూపు. మా సంక్షేమం కోసం ఏ రోజూ ఆలోచించ లేదు. ఎన్నికల సమయంలో ఏటా రూ.15 వేల ఆర్థిక సాయం, 21, 31 జీవోల రద్దు, పీఎఫ్, ఈఎస్‌ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రమాద బీమా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచిపోయినా ఒక్క హామీ కూడా అమలు కాలేదు. ప్రభుత్వ తీరుతో ఆటో డ్రైవర్లు, మోటారు వర్కర్లు చాలా నష్టపోతున్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చాలని రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతున్నాం.

– జి.వామనమూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ మోటారు వర్కర్స్ ఫెడరేషన్

కొత్త జీవోలతో రవాణా రంగం నిర్వీర్యం



ఉబర్, ఓలా ఆన్‌లైన్ యాప్స్ వచ్చాక ఆటో డ్రైవర్లు బేరాలు లేక నష్టపోతున్న పరిస్థితి. రోజంతా తిరిగితే రూ.700 నుంచి రూ.800 ఆదాయం వస్తోంది. అందులో డీజిల్, ఇతర ఖర్చులు పోనూ మిగిలే రూ.300తో కుటుంబాన్ని నెట్టుకురావాలి. ఇటువంటి దయనీయ పరిస్థితిలో కొత్త జీవోలతో భారీ జరిమానాలు చెల్లించలేక అప్పులపాలవుతున్నాం. గత ప్రభుత్వం ఏటా రూ.10 వేలు వాహనమిత్ర ఇచ్చేది. ఆటోల మరమ్మతులు, ఎఫ్‌సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్‌కు ఉపయోగపడేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

– కేలం శివ, నగర అధ్యక్షుడు, ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ మోటారు వర్కర్స్ ఫెడరేషన్

యాక్టు 106 (1) (2) ప్రమాదకరం



డీజిల్, పెట్రోల్ ధరలు, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, ఆటో విడి భాగాల ధరలు జీఎస్టీ పరిధిలోకి తేవాలి. ఆటో డ్రైవర్ల ఆదాయానికి నష్టం కలిగించే ఉబర్, ఓలా, ర్యాపిడో ఆన్‌లైన్ యాప్స్ రద్దు చేయాలి. పాత ఈ – చలానాలు రద్దు చేయాలి. డ్రైవర్లకు వ్యక్తిగత బీమా పాలసీ రూ.10 లక్షలు అమలు చేయాలి. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 894 గెజిట్ రద్దు చేయాలి. ప్రమాదాల నివారణ పేరుతో కేంద్రం డ్రైవర్లకు విధించిన 7 సంవత్సరాల జైలు, రూ.10 లక్షల జరిమానా విధించే యాక్టు 106(1) (2) చాలా ప్రమాదకరం. జీవో 21, 31 రద్దు చేస్తే డ్రైవర్లకు మేలు జరుగుతుంది.

– వై.స్వామి, ఆటో డ్రైవర్, నరసింహనగర్ స్టాండ్

చంద్రబాబు మోసపూరిత హామీలివీ...

- బ్యాడ్జి కలిగిన అన్ని వాహనాల డ్రైవర్లకు వాహన మిత్ర కింద ఏటా రూ.15 వేలు ఆర్థిక సాయం.
- భారీ జరిమానాలకు కారణమవుతున్న జీవో నంబరు 21, 31 రద్దు చేసి మరలా కొత్త జీవోలు తీసుకొస్తాం.
- డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్‌ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు.
- డీజిల్, పెట్రోల్ ధరల తగ్గింపు.
- టాటా మ్యాజిక్ వ్యాన్‌లు, జీపులు, కార్లకు గ్రీన్ టాక్స్, లేబర్ టాక్స్, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, టోల్‌గేట్ ఫీజుల తగ్గింపు.
- డ్రైవర్ల సాధికార సంస్థ ఏర్పాటు చేసి ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్, విద్యా రుణాలు.
- చంద్రన్న బీమా ద్వారా సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాద మరణానికి రూ.10 లక్షలు చెల్లిస్తామని హామీలు గుప్పించారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మద్దిపాలెం : ఈపీడీసీఎల్ జోన్ – 2 ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధిలోని అన్ని 11 కేవీ విద్యుత్ ఫీడర్ల నిర్వహణలో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11 కేవీ ఎయిర్‌పోర్టు ఫీడర్ పరిధిలో అంబేడ్కర్ కాలనీ, సాయినగర్, జాకీర్ హుస్సేన్ నగర్, పార్వతీనగర్, మాధవధార, కళింగనగర్, తెన్నేటినగర్, వుడా లే అవుట్, రాజీవ్‌నగర్, వంశీనగర్, జర్నలిస్ట్ కాలనీ, పంజాబ్ హోటల్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

జల'ధార'లో పవిత్ర స్నానాలు


స్నానమాచరించేందుకు క్యూ కట్టిన భక్తులు

మద్దిపాలెం: మాధవధారలోని జలధార వద్ద పవిత్ర స్నానాలు ఆచరించేందుకు గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం ఉపవాసాలు, రాత్రంతా జాగారాలు చేసి మరుసటి రోజున సముద్ర స్నానం, నదీస్నానం, ప్రవహించే సహజసిద్ధమైన నీటిలో స్నానాలు చేస్తే పుణ్యఫలం వస్తుందని భక్తుల నమ్మకం. ఈ క్రమంలో భక్తులు మాధవధార జలధారకు భారీగా చేరుకుని స్నానమాచరించారు. శివనామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. అనంతరం అక్కడే కొలువైన శివయ్యను, మాధవస్వామి, వేణుగోపాలస్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

అలరించిన సుమధుర స్వరాలు


పాటలు పాడుతున్న గాయనీ గాయకులు

సీతంపేట : నగరానికి చెందిన సత్య సుమధుర స్వరాలు సంగీత సంస్థ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించిన తెలుగు, హిందీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. కృషి ఉంటే మనుషులు రుషులవుతారు శీర్షికన గాయనీ గాయకులు మేటి హిందీ, తెలుగు చిత్రాల్లోని పాటలు ఆలపించారు. సంగీత సంస్థ గౌరవ అధ్యక్షుడు, బీసీ సమన్వయ కమిటీ చైర్మన్ కట్టా మల్లేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజేశ్వరి, పి.బి.ఖాన్ ఆధ్వర్యంలో గాయనీ గాయకులు నరసింహమూర్తి, పెమ్మరాజు, కె.ఎల్.రావు, నాగేశ్వరరావు, ఆంజనేయరెడ్డి, జిలాని, సి.వి.రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, ఎస్.రాజేశ్వరి, పి.సత్యవతి, గంటి ఉష తదితరులు సోలో యుగళ గీతాలతో అలరించారు. కార్యక్రమంలో సన్‌మూర్తి, బయ్యా శ్రీనివాస్, స్వరూప, మంజుల తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై జెడ్సీ పరిశీలన


మురళీనగర్‌లో స్థానికుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న జెడ్సీ రాము

మురళీనగర్ : మురళీనగర్ పరిసరాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాల నిర్వహణపై జోన్ – 5 జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము గురువారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. కాలనీలోని నివాసితుల వద్దకు వెళ్లి స్వచ్ఛ సర్వేక్షణ్ జరుగుతున్న తీరుపై వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలనీల్లోని డ్రైనేజీల నిర్మాణ పనులను పరిశీలించారు. పారిశుద్ధ్య సిబ్బంది, వార్డు కార్యాలయాల్లో సిబ్బంది హాజరును ఆయన పరిశీలించారు. మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, జీవీఎంసీ సహాయ వైద్యాధికారి డాక్టర్ సునీల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, సూపర్‌వైజర్ చిరంజీవి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు


పాలిటెక్నిక్ కాలేజీ వద్ద పోలీసుల బందోబస్తు

మురళీనగర్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. షెడ్యూలు ప్రకారం నిబంధనలు అమలు చేయడంతో ఎన్నికలు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు జరిగాయి. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలోని స్కిల్ డవలప్‌మెంట్ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని 421 మంది ఓటర్లకు కేటాయించగా వీరిలో పోలింగు ముగిసే సమయానికి 371 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ కేంద్రంలో 88 శాతం ఓటింగు నమోదయ్యింది. మరోవైపు ఓటింగు కేంద్రం సమీపంలో టెంట్లు ఏర్పాటుకు పోలీసు అధికారులు నిరాకరించారు. కేంద్రానికి 200 మీటర్ల దూరంలో కుర్చీలు ఏర్పాటు చేసుకుని కూర్చునేందుకు మాత్రమే అవకాశం ఇచ్చారు. ప్రచారానికి ఎటువంటి అవకాశం లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. కరపత్రాల పంపిణీని నిషేధించారు. యూనియన్లు, పార్టీ పరమైన బ్యానర్లు, అభ్యర్థులకు సంబంధించిన ఫొటోల ప్రదర్శనకు అనుమతివ్వలేదు. పోలీసు అధికారులు పకడ్బందీగా పర్యవేక్షించారు.

నగర అభివృద్ధిలో ఎన్జీవోల పాత్ర కీలకం


నరవ ప్రకాశరావును సత్కరిస్తున్న మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, బాలమోహన్‌దాస్

సీతంపేట : స్వచ్ఛంద సంస్థలు కోవిడ్ కాలంలో, ప్లాస్టిక్ వాడకం నిర్మూలన, మొక్కలు నాటడం, బాల కార్మిక వ్యవస్థ నియంత్రణ, నిరక్షరాస్యత నిర్మూలన... ఇలా ఎన్నో విషయాల్లో జీవీఎంసీతో కలిసి పని చేయడం అభినందనీయమని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. వైజాగ్ ఎన్జీవో ఫోరం ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన ప్రపంచ స్వచ్ఛంద సంస్థల దినోత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. త్వరలో ఎన్జీవో సంస్థల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి నగర అభివృద్ధిలో భాగస్వాములను చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సత్కరించారు. ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ ఇష్టపడి చేసే సేవ నిజమైనదని, వారిని గుర్తించి సత్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో సుమారు 75 స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని తమ అనుభవాలను వివరించారు. సీనియర్ ఎన్జీవో నరవ ప్రకాశరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో దాత్రి సంస్థ అధినేత విశాలాక్షి ప్రజ్ఞాన్‌కుమార్, డేవిడ్‌రాజు, వాసు, దిలీప్ పాల్గొన్నారు.

'సైన్స్‌పై ఫోకస్' పోటీల్లో ఆకట్టుకున్న నమూనా

ఆర్పీపేట పాఠశాల విద్యార్థుల ప్రతిభ


మోడల్‌ను ప్రదర్శిస్తున్న ఆర్పీ పేట పాఠశాల విద్యార్థులు, కో ఆర్డినేటర్ పల్లవి

కంచరపాలెం: సైన్స్ డే ను పురస్కరించుకుని డబ్ల్యూసీఎఫ్ సంస్థ వుడా చిల్డ్రన్ ఎరీనాలో గురువారం నిర్వహించిన 'సైన్స్ పై ఫోకస్' కార్యక్రమంలో కంచరపాలెం రామ్మూర్తి పంతులపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన మోడల్ ప్రదర్శించినట్లు ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ ప్రదర్శనకు హైస్కూల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ చొప్ప పల్లవి నేతృత్వంలో తొమ్మిదో తరగతి విద్యార్థులు డి.జెస్సీ, సీహెచ్ గౌతమి, బి.జ్యోత్స్న చక్కని నమూనా రూపొందించారు. పురాతన కాలంలో.. ఆధునిక కాలంలో మార్పులను సూచిస్తూ విద్య, వాహనాలు, వ్యవసాయానికి సంబంధించిన మూడు అంశాలను క్రోడీకరించి రూపొందించిన ఈ మోడల్ ఎంపిక కావడంపై హెచ్‌ఎం శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

కాలభైరవస్వామికి ఘనంగా పూజలు


పూజలందుకున్న కాలభైరవుడు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డులోని శ్రీ మహా గణపతి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప, షిరిడీ సాయిబాబా దేవస్థానంలో గురువారం కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తెచ్చిన పిండి వంటల దండను స్వామికి అలంకరించారు. అలాగే గుమ్మడి కాయలపై నెయ్యి దీపాలతో నైవేద్యం సమర్పించారు. దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, పాలాభిషేకరం నిర్వహించారు. భక్తుల గోత్ర నామాలతో పూజలు చేయించుకున్నారు. అంతకుముందు గణపతి మహా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్, సిబ్బంది శివ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

2న ఉచిత వైద్య శిబిరం

సీతమ్మధార : సీతమ్మధార గాంధీనగర్ పీ అండ్ టీ కాలనీలో గల రహమతుల్లా ఆస్పత్రి వద్ద మార్చి 2న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి అధినేత డాక్టర్ రహమతుల్లా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎబాట్, టోరంట్, ఇండోకో కంపెనీల సహకారంతో వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. బీఎండీ, థైరాయిడ్, బ్లడ్ షుగర్, హెచ్‌బీఏ వన్‌సీ, ఈసీజీ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. ఆదివారం ఉదయం 5.30 గంటల నుంచి 11 వరకు శిబిరం నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేటి నుంచి వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు

సీతమ్మధార : సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల గురువాయురప్పన్ శ్రీకృష్ణ మందిరంలో శృతిలయ భక్తి సంగీత సేవా సంస్థ వ్యవస్థాపకులు వి.ప్రభాకర్ సారథ్యంలో ఫిబ్రవరి 28 నుంచి మార్చి 1 వరకు విశ్వశ్రేయస్సును ఆకాంక్షిస్తూ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 వరకు శృతిలయ బృందంతో భక్తి గీతాలు, అన్నమాచార్య సంకీర్తనలు, కూచిపూడి నృత్యం, మహిళలచే సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణ, కుంకుమార్చన నిర్వహిస్తామని ప్రభాకర్ తెలిపారు. శనివారం ఉదయం స్వామి వారి తిరువీధి మహోత్సవం, సాయంత్రం పాణంగిపల్లి శ్రీరంగనాథ ఆచార్య స్వామి వారి బృందంచే మంగళధ్వని, అన్నమాచార్య సంకీర్తన, సుమధుర ఘట్టాలతో కూడిన వ్యాఖ్యానంతో శ్రీ భూ నీలా సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

అర్ధనారీశ్వరుడు అలంకారంలో కామేశ్వరుడు


భక్తులకు దర్శనమిచ్చిన అర్ధనారీశ్వరుడు


శ్రీలలితాపీఠంలో ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

సీతంపేట : మాఘమాసం అమావాస్య సందర్భంగా అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహించారు. ఆదిపరాశక్తి అనుగ్రహం పొందేందుకు గురువారం శ్రీప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి అనుగ్రహంతో పండితుల వేదమంత్రాల మధ్య హోమం శాస్త్రోక్తంగా జరిపారు. పరిసర ప్రాంత భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ భక్తుల కోరిక మేరకు లలితా పీఠంలో ప్రతి అమావాస్య రోజూ ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహిస్తున్నామని తెలిపారు. శత్రు నాశనం, ఆర్థిక ఇబ్బందులు తొలిగేందుకు, కోర్టు కేసుల్లో విజయం, ఉద్యోగ అభివృద్ధి విషయంలో శుభ ఫలితాల కోసం ఆదిపరాశక్తి ప్రత్యంగిరాదేవి అనుగ్రహం పొందేందుకు హోమం నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా మణిద్వీపంలో కామేశ్వరుడు అర్ధనారీశ్వరుని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఘనంగా శ్రీకృష్ణ మందిరం వార్షిక వేడుకలు


ప్రత్యేక అలకరణలో శ్రీకృష్ణుడు


భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ తదితరులు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం పరిధి గొల్లకంచరపాలెం విఘ్నేశ్వర మహాలక్ష్మి సహిత శ్రీకృష్ణ మందిరం 10వ వార్షిక వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు పల్లా ఎర్నికుమార్ యాదవ్, కార్యదర్శి కొయ్య జగదీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారికి ఉదయం జలాభిషేకం, 108 కలశాలతో పంచామృతాభిషేకాలు చేశారు. నూతన వస్త్రాలంకరణ అనంతరం గరికపూసలు, మారేడు దళాలతో అర్చించారు. అన్నాభిషేకం చేశారు. కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి రామారెడ్డి, కాయిత పైడి రత్నాకర్, సర్వసిద్ధి సాయిలత, శ్రీకృష్ణ యాదవ్ సంక్షేమ సంక్షేమ సభ్యులు కృష్ణ భగవానుని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం గొల్లకంచరపాలెం గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ చేతుల మీదుగా భారీ అన్న సమారాధన ప్రారంభించారు. సుమారు 3వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను తిరువీధి నిర్వహించారు. పాలక– కార్యవర్గ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు పనులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు సర్వసిద్ధి ఉమ, కొయ్య శ్రీను, నైదాన సురేష్, నమ్మి జ్యోతేష్, నమ్మి నాగ సురేష్, నమ్మి శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు అప్పగింత

సీతమ్మధార: మధ్యప్రదేశ్‌కు చెందిన పుల్షీరామ్ మానసిక స్థితి బాగోలేకపోవడంతో రెండేళ్ల క్రితం విశాఖ వచ్చేశాడు. పలు ప్రాంతాల్లో సంచరిస్తుండగా జీవీఎంసీ టీఎస్ఆర్ షెల్టర్‌లో ఏయూటీడీ చేర్పించింది. శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులు అతడికి సపర్యలు చేసి చికిత్స అందజేశారు. అప్పటి నుంచి నేటి వరకు క్రమం తప్పకుండా మందులు వాడించడంతో కోలుకున్నాడు. దీంతో పుల్షీరామ్‌ను స్వగ్రామానికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

విలీన సభ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ ప్రతినిధులు

సీతమ్మధార: రాష్ట్రంలోని రెండు ఐఎఫ్‌టీయూ విప్లవ కార్మిక సంఘాల విలీన సభ మార్చి 2న నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వేంకటేశ్వర్లు ప్రకటించారు. జీవీఎంసీ గాంధీ పార్కులో దీనికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. నాలుగు లేబర్ కోడ్‌లను బలవంతంగా కార్మిక వర్గంపై రుద్ది వారి హక్కులను కాలరాయడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని మండిపడ్డారు. ఒకవైపున నిత్యావసర సరుకుల ధరలు పెద్ద ఎత్తున పెరుగుతూ ఉంటే మరొకవైపు కార్మికుల వేతనాల తగ్గింపు, పనిభారం పెంపు తగదన్నారు. ఈ నేపథ్యంలో బలమైన కార్మిక పోరాటానికి ఈ విలీనం దోహదపడుతుందన్నారు. సంఘం సీనియర్ నాయకులు వై.కొండయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతిరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీను, దుర్గ, పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు చిన్నారి


పాపను తల్లికి అప్పగించిన పోలీసులు

అల్లిపురం: మహా శివరాత్రి పుణ్యస్నానాలు సందర్భంగా బుధవారం ఆర్కేబీచ్ కిటకిటలాడింది. వేలాది మంది భక్తులు రావడంతో బీచ్ ప్రాంతం జనసందోహమైంది. ఈ సమయంలో చిన్నారులు తప్పిపోవడంతో వారి తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో కంచరపాలేనికి చెందిన తణుశ్రీ తల్లిదండ్రుల నుంచి తప్పిపోయింది. బాలికను గుర్తించిన మహారాణిపేట పోలీసులు చేరదీసి పోలీస్ అవుట్‌పోస్టులో కూర్చోబెట్టారు. పాపకు భోజనం పెట్టి ఆకలి తీర్చారు. ఇంతో పాలు మైక్‌లో ఎనౌన్స్‌మెంట్ ఇచ్చారు. దీంతో తల్లిదండ్రులు అక్కడికి చేరుకోవడంతో పాపను అప్పగించారు. ఈ సందర్భంగా వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.